సాక్షి
సూర్యాపేట
బుధవారం, 13, డిసెంబర్, 2023



విద్యుత్ అధికారుల అడ్డగింత
అనుమతులు లేకుండా తమ భూముల్లో 11కేవీ లైన్లు వేస్తున్నారని రైతులు విద్యుత్ అధికారులను అడ్డుకున్నారు. - 8లో



శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి నిత్యకల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. - 10లో



యాదాద్రిలో వన భోజనాలు
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మంగళవారం కార్తీక వన భోజనాలు నిర్వహించారు. - 10లో

‘నామినేటెడ్’పై ఆశలు

- కొత్త ప్రభుత్వంలో పదవుల కోసం మొదలైన ప్రయత్నాలు
- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా ఆశావహులు
- మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి చుట్టూ ప్రదక్షిణలు
- రాష్ట్ర, జిల్లాస్థాయిలో పోస్టులు పొందేలా వ్యూహాలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నేతలు ఆశలు పెంచుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే గత ప్రభుత్వ హయాంలో నియమించిన నామినేటెడ్ పోస్టులన్నింటినీ రద్దు చేసింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలోని ఆశావహులు పదవుల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచర నేతలు ఎవరికి వారు నామినేటెడ్ పదవులను దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టారు.

పదేళ్లు అధికారానికి దూరమైన కాంగ్రెస్

తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ వెంటనే అధికారంలోకి వస్తుందని అంతా భావించారు. కానీ వరుసగా రెండుసార్లు బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ దాదాపు పదేళ్ల పాటు అధికారానికి దూరమైంది. ఈ రెండు విడతల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు చాలా మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఒక దశలో ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం కూడా లేకుండా పోయింది. దీంతో కాంగ్రెస్ పార్టీ గడ్డు పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. కార్యకర్తలంతా కాంగ్రెస్‌ను అంటి పెట్టుకుని పార్టీని కాపాడుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసుల పాలై ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు ఎంతో కష్టపడ్డారు. ఇప్పుడు వారంతా నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. ఎలాగైనా రాష్ట్రస్థాయిలో లేదంటే జిల్లా స్థాయిలో పదవులు పొందేలా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆశావహుల సంఖ్య అధికమే..

నామినేటెడ్ పోస్టుల కోసం ఉమ్మడి జిల్లాలో ఆశావహులు భారీగానే ఉన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తుంగతుర్తి టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నాలు చేశారు. అక్కడ మందుల సామేల్‌కు టికెట్ ఇచ్చారు. మోత్కుపల్లికి నామినేటెడ్ పదవి ఇస్తారన్న చర్చ సాగుతోంది. అక్కడి నుంచి 2014, 2018 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అద్దంకి దయాకర్‌కు ఈసారి టికెట్ ఇవ్వలేదు. దయాకర్ తనకు ఎమ్మెల్సీ ఇస్తారన్న ఆశల్లో ఉన్నారు. ఆలేరు నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్, టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి నామినేటెడ్ పదవుల రేసులో ఉన్నారు. నల్లగొండ జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి నామినేటెడ్ పదవిని ఆశిస్తున్నారు. కార్పొరేషన్ పదవుల కోసం టీపీసీసీ డెలిగేట్ తంగళ్లపల్లి రవికుమార్, పోత్నక్ ప్రమోద్‌కుమార్ ప్రయత్నిస్తున్నారు. మిర్యాలగూడలో టికెట్ కోసం డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ప్రయత్నించినా దక్కలేదు. ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే భారతీ రాగ్యానాయక్, స్కైలాబ్ నాయక్ నామినేటెడ్ పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. కోదాడ నియోజక వర్గంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావుకు కూడా ఏదైనా పదవి ఇస్తారన్న చర్చ సాగుతోంది. హుజూర్‌నగర్ నియోజక వర్గంలో ఈడుపుగంటి సుబ్బారావు, తన్నీరు మల్లికార్జున్‌రావు, అల్లం ప్రభాకర్‌రెడ్డి, ఎరగాని నాగన్నగౌడ్, సాముల శివారెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు.

‘గ్యాస్’ కేవైసీ పేరిట దగా

కేవైసీ చేయించుకుంటేనే రూ.500కు గ్యాస్ సిలిండర్ అంటూ ప్రచారం



గ్యాస్ కనెక్షన్‌కు కేవైసీ నమోదు చేయించుకునేందుకు సూర్యాపేటలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద మంగళవారం వినియోగదారులు ఇలా బారులుదీరారు. కేవైసీకి కావాల్సిన పత్రాలు ఇచ్చి రెండు రోజులుగా వస్తున్నా నమోదు కావడం లేదని పేర్కొన్నారు. కేవైసీ చేయాలంటే రూ.300 ఇచ్చి సురక్ష పైపు తీసుకోవాలని నిర్వాహకులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని ప్రతీ ఏజెన్సీ ముందు ఇదే పరిస్థితి.

- గ్యాస్ ఏజెన్సీలకు వినియోగదారుల పరుగులు
- బలవంతంగా అధిక ధరకు సురక్ష పైపులు అంటగడుతున్న వైనం
- ఒక్కో పైపుపై రూ.110 నుంచి రూ.200లకు పైగా దోపిడీ
- తెలిసినా చర్యలకు వెనుకాడుతున్న సివిల్ సప్లయీస్ అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తామన్న రూ.500 సిలిండర్ పథకం పేరుతో గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సాధారణంగా ప్రతి రెండేళ్లకు ఒకసారి నమోదు చేసుకునే కేవైసీని రూ.500 పథకానికి అంటగడుతూ ప్రజలను మోసం చేస్తున్నాయి. కేవైసీ నమోదు పేరుతో సురక్ష పైపులను తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. ఒక్కో పైపుపై రూ.200 వరకు దోపిడీ చేస్తున్నారు. ఇది తెలిసినా సివిల్ సప్లయీస్ అధికారులు వారిపై చర్య తీసుకోక వంతపాడుతున్నారని ఆరోపణలున్నాయి.

కేవైసీ తప్పనిసరి అంటూ ప్రచారంతో...

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హామీల్లో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ కూడా ఇస్తామని ప్రకటించింది. రూ.500 పథకం అందాలంటే గ్యాస్ వినియోగదారులు కేవైసీ తప్పనిసరి అనే ప్రచారంతో గ్యాస్ వినియోగదారులు ఏజెన్సీల వైపు పరుగులు తీస్తున్నారు.

ప్రతి రెండేళ్లకోసారి..

వాస్తవానికి ప్రతీ రెండేళ్లకోసారి కేవైసీ స్పెషల్ డ్రైవ్ చేపడతారు. గ్యాస్ వినియోగదారుల్లో ఎవరైనా మరణించినా, బదిలీ అయినా, విదేశాలకు వెళ్లినా, గ్యాస్ కనెక్షన్ వదిలేసుకున్న వారి వివరాలు సేకరించేందుకు ఈ డ్రైవ్ చేపడతారు. లేకపోతే సదరు కనెక్షన్లు లేకున్నా.. ఉన్నట్లు చూపించి ఆ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించే ప్రమాదముంది. వీటికి చెక్‌పెట్టేందుకే ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్స్ చేపడుతుంటుంది. ఈక్రమంలో వినియోగదారుల ఆధార్, చిరునామా, బ్యాంక్ ఖాతా వివరాలను నెల రోజులుగా సేకరిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాక ముందే ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల రిజిస్ట్రేషన్‌తో పాటు కేవైసీ అప్డేట్ డ్రైవ్ మొదలైంది. ఏజెన్సీలు దీనిపై తప్పుడు ప్రచారం చేసినట్లు తెలుస్తోంది. కేవైసీ ఉంటేనే రూ.500 సిలిండర్ వస్తదని నిర్వాహకులు చెప్పినట్లు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

ముక్కుపిండి వసూలు

కొద్ది రోజులుగా కేవైసీ ప్రక్రియ మందకొడిగా సాగడంతో ప్రచారం జరగలేదు. మూడు రోజుల నుంచి లబ్ధిదారులు ఏజెన్సీలకు పరుగులు తీస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు ఇదే అదునుగా కేవైసీ చేయాలంటే సురక్ష పైపులు తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. పైపు విలువ రూ. 190 కాగా వినియోగదారల నుంచి రూ.250 నుంచి రూ.300 వరకు వసూలు చేశారు. కొన్ని చోట్ల రూ. 500 వరకు తీసుకున్నట్లు సమాచారం. సాధారణంగా వినియోగదారులకి అవసరం ఉంటేనే సురక్షపైపు తీసుకోవాలి.. కానీ బలవంతంగా అంటగడుతున్నారని బహిరంగగానే ఆరోపిస్తున్నారు. కేవైసీ గందరగోళంపై సూర్యాపేటలోని ఓ ఏజెన్సీలో మంగళవారం విచారణకు వచ్చిన సివిల్ సప్లయ్ అధికారికి వినియోగదారులు ఈ విషయాన్ని తెలిపినా బలవంతంగా వసూలు చేయవద్దు అని ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. కాని చర్యలుకు వెనుకాడారు.

జిల్లాలో 2,93,766 గ్యాస్ కనెక్షన్లు

జిల్లాలో మూడు కంపెనీలకు చెందిన 13 సాధారణ డిస్టిబ్యూటర్లు, 12 గ్రామీణ వితరక్ డిస్టిబ్యూటర్లు ఉన్నారు. 25 ఏజెన్సీల పరిధిలో 1,66,508 సింగిల్ సిలిండర్ కనెక్షన్లు, 50,082 డబుల్ సిలిండర్ కనెక్షన్లు, 11,851 దీపం కనెక్షన్లు, 51,359 సీఎస్‌ఆర్ కనెక్షన్లు మొత్తం 2,93,766 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఉజ్వల గ్యాస్ కనెక్షన్ సిలిండర్ రూ.775 (రూ.247 సబ్సిడీ), దీపం వాళ్లకు రూ. 975 (సబ్సిడీ రూ.47), రెగ్యులర్ కనెక్షన్ రూ.975 (సబ్సిడీ రూ.47) చొప్పున సిలిండర్ ధరలు సబ్సిడీ కొనసాగుతున్నాయి.

విధి విధానాలు రాలేదు

కేవైసీ ఉన్న వారికి మాత్రమే రూ.500 సిలిండర్ దక్కుతుందని, లేకపోతే పథకం వర్తించదని కొందరు ప్రచారం చేశారు. ఇది నమ్మిన చాలా మంది ఏజెన్సీల ముందు బారులుదీరుతున్నట్లు తెలిసింది. వాస్తవానికి రూ.500 సిలిండర్ ఇవ్వాలన్న పథకాన్ని ప్రభుత్వం ఇంతవరకూ ప్రారంభించలేదు. అధికారిక ప్రకటన కూడా చేయలేదు. అపోహలు నమ్మొద్దు.

– మోహన్‌బాబు, డీఎస్‌ఓ

కేసుల పరిష్కారంలో అగ్రస్థానంలో నిలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

చివ్వెంల(సూర్యాపేట) : జ్యుడిషియల్, పోలీసు సిబ్బంది సమష్టి కృషితో లోక్ అదాలత్‌ను విజయవంతం చేసి, కేసుల పరిష్కారంలో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ కోరారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 30న సూర్యాపేట కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్న లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రిమినల్, సివిల్, బ్యాంకు, విద్యుత్, వాహన చట్టం, ఎక్సైజ్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మొదటి ఆదనపు న్యాయమూర్తి అమరావతి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్య యాదవ్, డీఎస్పీ నాగభూషణం, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఘంటసాల గాత్రం మధురం

- సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల గాత్రం మధురమని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం కిరాణ ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ భవన్‌లో శ్రీజ్ఞాన సరస్వతీ సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఘంటసాల 101వ జయంతి వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3దశాబ్దాల పాటు తన గానంతో తెలుగు శ్రోతలను ఉర్రూతలూగించారని, ప్రజల హృదయాల్లో ఘంటసాల చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, డీఎస్పీ నాగభూషణం, సంస్థ ప్రధాన కార్యదర్శి గుండా రమేష్, బండి రాధాకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి గణేష్, సత్యం, సరిత, పుల్లయ్య, బొమ్మిడి లక్ష్మీనారాయణ, రంగారెడ్డి, హమీద్‌ఖాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

పంటల సాగు వివరాలు నమోదు చేయాలి

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో 2023–24 యాసంగి సీజన్‌లో చేపట్టిన పంటల సాగు విస్తీర్ణత నమోదు చేయాలని కలెక్టర్ వెంకట్రావు తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సీజన్‌లో మండలాల వారీగా రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలు నమోదు పకడ్బందీగా జరగాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ క్లస్టర్ పరిధిలోని రైతుల సర్వే నంబర్ల వారీగా వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు వివరాలను క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఉద్యానవన, వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి, వారిని మానసికంగా సిద్ధం చేయాలన్నారు. ఆయిల్ సాగును మరింత ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీఏఓ రామారావు నాయక్, సీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం

- ట్రెజరీ నుంచి నేరుగా రైతుల ఖాతాల్లోకి..
- తొలిరోజు ఎకరం భూమి ఉన్న వారికి డబ్బులు జమ
- గతంలో మాదిరిగానే ఎకరానికి రూ.5వేల చొప్పున..



భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం డబ్బులను మంగళవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయడం ప్రారంభించింది. జిల్లాలో 2,70,853 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులు. ఇందులో రెండున్నర ఎకరాల లోపు ఉన్న రైతులు 1,98,542 మంది ఉన్నారు. రెండున్నర నుంచి ఐదెకరాల లోపు 48,806 మంది, 10 ఎకరాల లోపు 19,489 మంది, ఆపై 4016 మంది రైతులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తోంది. తొలి రోజు ఎకరం భూమి ఉన్నవారికి తరువాత రెండెకరాలు, ఆ తరువాత మూడెకరాలు ఈ విధంగా దశల వారీగా రైతుల ఖాతాల్లో యాసంగి పెట్టుబడి సాయం జమ చేస్తారని వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. మొదటిరోజు ఎకరం లోపు ఉన్న రైతులకు నిధులు జమ జమ అవుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీజన్ ప్రారంభమైందని..

ఎన్నికలకు ముందే రైతుబంధు సొమ్మును రైతుల ఖాతాలో వేసేందుకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ అనుమతి కోరింది. ఇందుకు అనుమతి ఇవ్వగా ఒకట్రెండు రోజుల్లో నిధులు జమయ్యే సమయానికి ఈ అనుమతిని వెనక్కి తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయాన్ని రైతుభరోసా పేరుతో ఎకరానికి రూ.7500 చొప్పున ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పెట్టుబడి సాయం ఎకరానికి ఏడాదికి రూ.15,000 వేస్తారా లేదా గత ప్రభుత్వం మాదిరిగా రూ.10వేలు వేస్తారా అనే చర్చ రైతుల్లో సాగింది. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసాపై ఎలాంటి గైడ్‌లైన్స్ రూపొందించక లేదు. యాసంగి సీజన్ పనులు ప్రారంభం కావడంతో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం గతంలో మాదిరిగానే పెట్టుబడి సాయాన్ని అందించాలని నిర్ణయించి ప్రక్రియను ప్రారంభించింది.

పట్టుబడితే పీడీయాక్ట్..!

రేషన్ బియ్యం దందాకు చెక్

- హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలపై అధికారుల నిఘా
- పీడీయాక్ట్ ప్రయోగిస్తామని రేషన్ బియ్యం వ్యాపారులకు హెచ్చరిక
- సూత్ర, పాత్రధారులతో పాటు ఏపీలోని ఓ వ్యాపారికి ఇప్పటికే వార్నింగ్



కోదాడ: అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు కోదాడ కేంద్రంగా సాగిన రేషన్ బియ్యం దందాకు చెక్ పడిందా..? కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో పోలీస్, సివిల్ సప్లయీస్ అధికారులు అప్రమత్తమయ్యారా? పీడీయాక్ట్ ప్రయోగిస్తామని రేషన్ బియ్యం వ్యాపారులకు సంబంధిత అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరికలు జారీ చేశారా? ఇక.. తమ ఆటలు సాగవని దందా సాగిస్తున్న సూత్ర, పాత్రధారులు మిన్నకుండిపోయారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇంతకాలం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రాల్లో యథేచ్ఛగా సాగిన రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్టపడినట్లు తెలుస్తోంది. ఈ రెండు నియోజకవర్గాల్లో రేషన్ బియ్యం వ్యాపారంతో సంబంధమున్న వ్యాపారులకు సంబంధిత అధికారులు ఇప్పటికే వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల వ్యాపారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్న కృష్ణా జిల్లాకు చెందిన వ్యాపారికి కూడా మరోసారి ఇక్కడ పట్టుబడితే పీడీయాక్ట్ కేసు పెడతామని హెచ్చరించినట్లు సమాచారం. అధికార పార్టీ, మీడియా ముసుగులో ఈ వ్యాపారంలో కీలకంగా ఉన్న కొందరిని కూడా పోలీసులు హెచ్చరించి, ఈ విషయంలో జోక్యం చేసుకుంటే ఊచలు లెక్కపెట్టాల్సి ఉంటుందని మందలించినట్లు సమాచారం.

కోదాడ టు కాకినాడ

కోదాడ నియోజకవర్గంలో రేషన్‌బియ్యం దందా నాలుగైదు ఏళ్లగా జోరుగా సాగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కోదాడ కేవలం 13 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఈ దందాకు అనుకూలంగా మారింది. రాత్రి సమయాల్లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సేకరించిన బియ్యాన్ని రాత్రికి రాత్రే కృష్ణాజిల్లాలోని అనుమంచిపల్లి వద్ద ఉన్న తోటలో డంపు చేసేవారు. అధికారపార్టీకి చెందిన కొందరు నేతల, వ్యాపారుల కనుసన్నల్లో ఈ వ్యవహారం సాగడం, పోలీసులకు కూడా నెలవారీ మామూళ్లు అందుతుండడంతో పాటు మీడియా ముసుగులో కొందరు అన్ని రకాల అండదండలు అందిస్తుండడంతో వీరి అగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఎవరైనా అడ్డుకుంటే దాడులకు పాల్పడడం, అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరించడం పరిపాటిగా మారింది. పోలీసులు కూడా దందారాయుళ్లకు కొమ్ముకాసారని ఆరోపణలు ఉన్నాయి. పీడీఎస్ బియ్యాన్ని కోదాడకు చెందిన కొందరు మిల్లర్లు నేరుగా కాకినాడకు తరలిస్తుండగా మరి కొందరు రిసైక్లింగ్‌కు పాల్పడతున్నారు. మరి కొందరు డబుల్ పాలిష్ చేసి సన్న బియ్యంగా అంటగడుతున్నారు.

తిలాపాపం తలా పిడికెడు

కోదాడలో జరుగుతున్న రేషన్‌బియ్యం దందాలో ఇప్పటివరకు రాజకీయ నాయకులు, వ్యాపారులు, మీడియా ప్రతినిధులు, పోలీసులు భాగస్వాములుగా ఉండి తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. నెలవారీ మామూళ్లు లక్షల్లో అందుతుండడంతో దందారాయుళ్లను పట్టుకున్న సమయంలో రెవెన్యూ వారికి అప్పగించి కేవలం 6ఏ కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. కొందరు వ్యాపారులు సంవత్సరాల తరబడి ఇదే వ్యాపారం చేస్తున్నా పట్టించుకోకపోవడం వెనుక అప్పటి అధికార పార్టీ ఒత్తిడితో పాటు మామూళ్ల మత్తే కారణమని పలువురు పేర్కొంటున్నారు.

గంజాయి రవాణాపై ఆరా

కోదాడలో గంజాయి వ్యాపారాన్ని కూకటి వేళ్లతో పెకిలిస్తానని సోమవారం ఎమ్మెల్యే పద్మావతి ప్రకటించడంతో పాటు దీనిపై పోలీసులకు కూడా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో పోలీసులు కోదాడకు గంజాయి సరఫరా చేస్తున్న వారిపై నిఘా పెట్టడంతో పా టు వ్యాపారంలో భాగస్వాములుగా ఉన్న వారిపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. గంజాయి వ్యాపారంపై పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ కొందరు అధికారపార్టీ నేతల ఒత్తిడితో అంతగా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఈ నెల 18 తర్వాత మళ్లీ కోదాడకు వచ్చి అన్ని విషయాలపై సమగ్ర విచారణ చేయిస్తానని ఎమ్మెల్యే ప్రకటించడంతో ఈ దందారా యుళ్లు కొందరు క్రమంగా తెరవెనుకకు వెళుతున్నట్లు సమాచారం.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీలలో సాధారణ కాన్పులు పెంచాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

అర్వపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచేలా వైద్య సిబ్బంది కృషిచేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం కోరారు. మంగళవారం అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమ తెరలు వాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చిలుకూరి మణిదీప్, సీహెచ్‌ఓ ఎల్.చరణ్, ల్యాబ్ టెక్నీషియన్ కస్పరాజు లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్ కుంభం వీరయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21న భగవద్గీత కంఠస్థ పోటీలు

భానుపురి (సూర్యాపేట) : విద్యార్థుల్లో ధారణ శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ఉద్దేశంతో డిసెంబర్ 21న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భగవద్గీత మందిరంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయాలు, ధార్మిక సంస్థల ఐక్యవేదిక ప్రతినిధులు నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా ముందుగా నిర్దేశించిన శ్లోకాలలో ప్రాథమిక విద్యార్థులు10శ్లోకాలు, ఉన్నత విద్యార్థులు 20 శ్లోకాలు కంఠస్థం చేసుకుని రావాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు డిసెంబర్ 18లోగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9848749022 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

‘పది’లో వందశాతం ఫలితాలు సాధించాలి

నడిగూడెం : పదో తరగతిలో వందశాతం ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ కోరారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని, ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. ఉన్నతి, తొలిమెట్టు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అంతకు ముందు తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో పాఠ్య పుస్తకాలను చదివించారు. ఆయన వెంట ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అవిశ్వాస తీర్మానానికి నోటీసు అందజేత



డీసీఓకు వినతిపత్రం అందజేస్తున్న డైరెక్టర్లు

నూతనకల్ : నూతన్‌కల్ మండల పరిధిలోని పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ పలువురు డైరెక్టర్లు మంగళవారం సహకార డీసీఓ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సహకార సంఘం వైస్ చైర్మన్ నాగం జయసుధ మాట్లాడుతూ సంఘంలో 13మంది డైరెక్టర్లు ఉండగా 11మంది అవిశ్వాసానికి మద్దతుగా సంతకాలు చేశారని ఆమె తెలిపారు. 15రోజుల్లో అవిశ్వాస తీర్మానానికి ఏర్పాట్లు చేయనున్నట్లు అధికారి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు పసుల వెంకన్న, కాసోజు మధనచారి, మాతంగి వెంకన్న, తొట్ల లక్ష్మయ్య, పాతులోతు శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో విశేష పూజలు కొనసాగాయి. శ్రీస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను మంగళవారం విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు నిర్వహించారు.

క్లుప్తంగా

రైలు నుంచి కిందపడి వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: రైలు నుంచి కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి–పగిడిపల్లి మధ్య చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి–పగిడిపల్లి రైల్వే స్టేషన్ల మధ్యలో 239/25 మైలురాయి వద్ద పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించారు. రైలులో వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటాయని, నీలం రంగు చొక్కా, లుంగీ, నలుపు రంగు లోదుస్తులతో పాటు జంజం ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వివరాల కోసం 9847222169, 8712568454 నంబర్లను రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు.

ప్రయాణికురాలి బ్యాగులో బంగారు ఆభరణాలు చోరీ

నల్లగొండ రూరల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి బ్యాగులో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు 8 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. వివరాలు.. స్వప్న అనే ప్రయాణికురాలు మంగళవారం హైదరాబాద్ నుంచి వేములపల్లి మండలంలో ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు ఆర్టీసీ బస్సులో వచ్చింది. నార్కట్‌పల్లి బస్టాండ్‌లో బస్సు దిగి నల్లగొండ వైపు వచ్చే ఎక్స్‌ప్రెస్‌లో బస్సులో ఎక్కి నల్లగొండ బస్టాండ్‌లో దిగి తన బ్యాగును చూసుకోగా అందులోని 8 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే టూటౌన్ ఎస్‌ఐ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

చెరువుపల్లిలో బైక్ చోరీ

మాడుగులపల్లి: ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైంది. ఈ ఘటన మాడుగులపల్లి మండలంలోని చెరువుపల్లి గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువుపల్లికి చెందిన గడ్డం మహేష్‌రెడ్డి మిర్యాలగూడ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటి ఆవరణలో బైక్ పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి బయట తలుపులకు గడియపెట్టి బైక్‌ను చోరీ చేశారు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో బాధితుడి తండ్రి రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామ శివారులోని బిక్కేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదవుతాయని హెచ్చరించారు.

‘ధరణి’లో కనిపించని భూమి

- తన భూమిని కాజేయాలని చూస్తున్నారని బాధితుడి ఆవేదన
- ప్రజావాణిలో సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానని వెల్లడి



మిర్యాలగూడ: తన అవసరాల నిమిత్తం భూమిని విక్రయిద్దామని అనుకున్న రైతుకు రెవెన్యూ అధికారులు షాక్ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో తన 30 గుంటల భూమికి సంబంధించిన వివరాలు కనిపించడంలేదని సదరు రైతు వాపోయాడు. మిర్యాలగూడ మండలం తుంగపహాడ్ గ్రామానికి చెందిన బాధితుడు గొడ్డేటి రామయ్యయాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. తనకు తుంగపహాడ్ గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నంబర్ 630(అ)లో 30 గుంటలు, సర్వే నంబర్ 630(ఆ)లో 25గుంటల భూమి మొత్తం 1.15ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించినట్లు తెలిపాడు. తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పాసుపుస్తకంలో సైతం తన పేరిట భూమి వివరాలు సక్రమంగానే నమోదైనప్పటికీ, ధరణి పోర్టల్‌లో మాత్రం 25గుంటల భూమి తక్కువగా చూపిస్తుందని పేర్కొన్నాడు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్, ఆర్డీఓను కలిసి పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించలేదని, 2022 జూలై 13న ప్రజావాణిలో సైతం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ధరణి పోర్టల్‌లో భూమి నమోదు కాలేదని పేర్కొన్నాడు. ఇటీవల తన అవసరాల నిమిత్తం ఉన్న భూమిని విక్రయిద్దామని పహాణీ కోసం ప్రయత్నించగా మిగతా 30 గుంటల భూమి కూడా రికార్డుల నుంచి మాయమైందని ఆవేదన వ్యక్తం చేశాడు. వారసత్వంగా సంక్రమించిన భూమిని రికార్డుల నుంచి తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని రామయ్యయాదవ్ కోరుతున్నాడు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తా

నా పట్టా భూమి 25గుంటలు మొదట రికార్డుల నుంచి మాయం చేశారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసి నా భూమి ఆన్‌లైన్‌కు ఎక్కలేదు. ఉన్న 30 గుంటల భూమి ఇప్పుడు ధరణిలో కనిపించడం లేదు. నాకు చదువు రాదని ఎవరో నా భూమిని కాజేయాలని చూస్తున్నారు. అధికారులు స్పందించకపోతే హైదరాబాద్‌కు వెళ్లి ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తా.

– గొడ్డేటి రామయ్యయాదవ్, రైతు



సీఎంఓలో కీలక పోస్టుల్లో ఉమ్మడి జిల్లా వాసులు

- సీఎం రేవంత్‌రెడ్డి సీపీఆర్‌ఓగా తుర్కపల్లి మండల వాసి బోరెడ్డి అయోధ్యరెడ్డి
- చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా చిట్యాల మండలానికి చెందిన గుమ్మి చక్రవర్తి నియామకం



బోరెడ్డి అయోధ్యరెడ్డి



గుమ్మి చక్రవర్తి

తుర్కపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య ప్రజాసంబంధాల అధికారి(సీపీఆర్‌ఓ)గా యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన బోరెడ్డి అయోధ్యరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంసీజే, కేవీ రంగారెడ్డి లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన బోరెడ్డి అయోధ్యరెడ్డి వివిధ దినపత్రికల్లో రిపోర్టర్‌గా పనిచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొని కీలక భూమిక పోషించారు. 2018లో సాక్షి దినపత్రికలో రిపోర్టర్‌గా తన ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిస్థాయిలో కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా, మీడియా కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. భారత్ జోడో యాత్రలో మీడియా కమిటీ కన్వీనర్‌గా, 2023 ఎన్నికల్లో వార్‌రూమ్ కోఆర్డినేటర్‌గా క్రియాశీలకంగా పనిచేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీపీఆర్‌ఓగా నియమితులయ్యారు.

చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా గుమ్మి చక్రవర్తి..

చిట్యాల: మండల పరిధిలోని ఏపూరు గ్రామ పంచాయతీకి చెందిన గ్రూప్–1 అధికారి గుమ్మి చక్రవర్తి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఆయన 2012–13లో గ్రూప్–1 ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. అనంతరం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో డీఎస్పీ, ఏసీపీగా విధులు నిర్వర్తించారు. కొంత కాలంగా నార్కోటిక్స్ విభాగంలో ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆయనను రాష్ట్ర డీజీపీ రవిగుప్తా ముఖ్యమంత్రి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గుమ్మి చక్రవర్తి తండ్రి వెంగళరెడ్డి కూడా గ్రూపు–1 అధికారిగా సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటైర్డ్ అయ్యారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి తెలంగాణ ముఖ్యమంత్రికి చీఫ్ సెక్యూరిటీ అధికారిగా నియమితులవ్వడం పట్ల ఏపూరు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల



శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న అధికారులు, రైతు ప్రతినిధులు

శాలిగౌరారం: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులలో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి ప్రస్తుత యాసంగి పంటకు మంగళవారం నీటిపారుదల శాఖ ఏఈ రాములు నీటిని విడుదల చేశారు. యాసంగి పంట సాగుకు వరినార్లు పోసుకునేందుకు అదును దాటిపోతుండటంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతులు, రైతు ప్రతినిధులు సమస్యను నీటిపారుదలశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా ఈ నెల 3న ‘యాసంగికి సాగునీరందేనా’ అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు ప్రాజెక్టులోకి నీరువచ్చే రాచకాల్వలో పూడికతీత పనులు వేగవంతం చేశారు. దీంతో సోమవారం ప్రాజెక్టులోకి నీరువచ్చి చేరుతుండడంతో నీటి విడుదలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయగా.. నీటిపారుదలశాఖ ఏఈ రాములు ప్రాజెక్టు నుంచి మంగళవారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకొని ఆయకట్టు చివరి భూములకు సాగునీరందేలా సహకరించాలని కోరారు. 21 అడుగుల నీటిసామర్థ్యం కలిగిన శాలిగౌరారం ప్రాజెక్టులో ప్రస్తుతం 11 అడుగుల మేర నీటినిల్వ ఉంది. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు చామల వెంకటరమణారెడ్డి, మహేందర్‌రెడ్డి, చాడ సురేశ్‌రెడ్డి, గోదల వెంకట్‌రెడ్డి, తొట్ల పుల్లయ్య, చిత్తలూరు జీడికల్లు, పడాల సైదులు, నిమ్మల వీరస్వామి, పడాల లింగయ్య, సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

42 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసిన అధికారులు

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ గ్రామంలో కట్ట ప్రవీణ్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 42 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని నకిరేకల్‌కు చెందిన పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్‌జ్యోతి సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. స్థానికులు అందించిన పక్కా సమాచారంతో దాడులు నిర్వహించామని ఆమె మంగళవారం ‘సాక్షి’కి తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసి నకిరేకల్‌లో గల ఎంఎల్‌ఎస్(మండలస్థాయి స్టాక్ పాయింట్)కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితుడు కట్ట ప్రవీణ్‌పై పౌరసరఫరాల శాఖకు సంబంధించిన 6ఏ కేసుతో పాటు ఐపీసీ 420, ఈసీ(ఎసెన్షియల్ కమాడిటీ) యాక్ట్ 7 కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కట్ట ప్రవీణ్ కొంతకాలంగా పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారంపై ప్రత్యేక దృష్టిపెట్టి అక్రమ వ్యాపారాన్ని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట నల్లగొండకు చెందిన పౌరసరఫరాలశాఖ ఆర్‌ఐ లింగస్వామి, స్థానిక పోలీసులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాలు.. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన బొంత సురేష్(32)ని అతడి సమీప బంధువు అయిన శాలిగౌరారం మండలం కుంటూరు గ్రామానికి చెందిన రాంబాబు ఈ నెల 9వ తేదీన భువనగిరి సమీపంలోని ఓ వెంచర్‌లో పని నిమిత్తం తీసుకొచ్చాడు. అదే రోజు రాత్రి వెంచర్ సమీపంలో మద్యం సేవించిన సురేష్ తిరిగి వెంచర్ వైపు వస్తుండగా హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని సురేష్‌ను చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. అతడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు, ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా సురేష్ కనిపించడంలేదని అతడి బంధువు రాంబాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు రాగా.. అతడికి సురేష్ ఫొటో చూపించగా గుర్తుపట్టి బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కృష్ణ తెలిపారు.

విద్యుత్ శాఖ అధికారుల అడ్డగింత



విద్యుత్ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

కోదాడ రూరల్: తమ అనుమతులు లేకుండా తమ భూముల మీదుగా 11కేవీ విద్యుత్ లైన్లు వేస్తున్నారని పలువురు రైతులు మంగళవారం విద్యుత్ శాఖ అధికారులను అడ్డుకున్నారు. వివరాలు.. కోదాడ పట్టణంలోని గుడిబండ రోడ్డులో పెట్రోల్ బంక్ వెనుక గల సేద్యపు భూముల మీదుగా ఇటీవల కొత్తగా నిర్మిస్తున్న తేజ రైస్ ఇండస్ట్రీ వరకు రైతుల అనుమతులు లేకుండా వారి భూముల మీదుగా 11కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే తమ అనుమతి లేకుండా తమ భూముల మీదుగా 11కేవీ విద్యుత్ లైన్లు ఎలా ఏర్పాటు చేస్తారని రైతులు విద్యుత్ శాఖ అధికారులను అడ్డుకున్నారు. అధికారులు ఏర్పాటు చేసే విద్యుత్ లైన్ల వల్ల తమ వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం కలగడమే కాక విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున ఈ పనులను నిలిపివేయాలని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇదే భూములలో రోడ్డు వెంట ఉన్న కొన్ని భూములు నాలా కన్వర్షన్ అనుమతులు పొందారని, భవిష్యత్‌లో ఇళ్ల నిర్మాణాలు జరిగితే ఈ లైన్ అత్యంత ప్రమాదకరంగా మారే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు హనుమారెడ్డి, రవీందర్‌రెడ్డి, చింత అనంతరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకట్రాంరెడ్డి, కాంతమ్మ, ఉపేందర్, గున్నం మాధవి, స్వాతి, కమలమ్మ, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీతాలు అందక రోడ్డున పడుతున్నాం

- వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి రాష్ట్ర కోచైర్మన్ లక్ష్మల్ల నరసింహారావు



హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

హుజూర్‌నగర్: ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో వీఆర్‌ఏల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి రాష్ట్ర కోచైర్మన్ లక్ష్మల్ల నరసింహారావు అన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన వీఆర్‌ఏలు మంగళవారం వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లోని ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఆర్‌ఏలను గత ప్రభుత్వం వివిధ శాఖల్లో సర్దుబాటు చేసి ఎంప్లాయీ ఐడీ కార్డు ఇవ్వలేదని అన్నారు. దీని మూలంగా వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న వారికి గత ఐదు నెలలుగా జీతాలు అందడం లేదని వాపోయారు. నూతన ప్రభుత్వమైనా స్పందించి ఐడీ కార్డులు మంజూరు చేసి జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం రెవెన్యూ డివిజన్ పరిధిలో గల న్యూ రెవెన్యూ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా సీహెచ్. కోటయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం. నాగు నాయక్, ఉపాధ్యక్షుడిగా జానిమియా, కోశాధికారిగా పి. పిచ్చమ్మ, సహాయ కార్యదర్శిగా బి. వీరబాబు, కార్యవర్గ సభ్యులుగా ఎం. రాజు, ఎస్. వెంకటేశ్వర్లు, ఎం. శ్రీనివాసు, పి. రాంబాబు, బి. ఝాన్సీ, డి. విజయలక్ష్మి, డి. ఇందిర, కే. శోభ, టి. నవతను ఎన్నుకున్నారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య

ముదినేపల్లి రూరల్: అప్పుల బాధ తాళలేక దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డ విషాదకర సంఘటన ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో మంగళవారం జరిగింది. విశ్వనాద్రిపాలెం గ్రామానికి చెందిన పరసా నాగబాబు (30)కు తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు చెందిన అనూష (25)తో 2015లో వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల బాబు, ఐదేళ్ల పాప ఉన్నారు. నాగబాబు కొంతకాలంగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నాడు. సాగులో నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. సాగులో కోలుకునే అవకాశం లేకపోవడం, అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో నాగబాబు దంపతులు మంగళవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ ముదినేపల్లి ఎస్సై వెంకటకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ అనూష తల్లిదండ్రులు సూర్యాపేట నుంచి వచ్చిన తరువాత మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ



చోరీకి గురైన ధాన్యపు రాశిని పరిశీలిస్తున్న గ్రామస్తులు

రామన్నపేట: మండలంలోని దుబ్బాక గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీకి గురైంది. ఈ సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక గ్రామానికి చెందిన మేడి మల్లయ్య, మేడబోయిన వెంకన్న తాము పండించిన ధాన్యాన్ని అమ్మడానికి స్థానికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి రాశిగా పోశారు. మంగళవారం ఉదయం రైతులు రాశుల వద్దకు వెళ్లి చూడగా ధాన్యం తగ్గింది. ధాన్యంను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ ఎం. లక్ష్మయ్య ధాన్యపు రాశులను పరిశీలించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. రెండురాశులలో కలిపి 120బస్తాల ధాన్యం ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది.

‘యాసంగి’కి సన్నద్ధమవుతున్న రైతులు

నడిగూడెం: ఈ యాసంగి సీజన్‌లో నీటి సౌకర్యం లేకున్నా గానీ మండల పరిధిలోని పలు గ్రామాలలో రైతులు వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు చాకిరాల, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబల్లి, రత్నవరం, శ్రీరంగాపురం, సిరిపురం గ్రామాలతో పాటు నాన్‌ఆయకట్టు గ్రామాలైన నారాయణపురం, బృందావనపురం, కాగితరామచంద్రాపురం గ్రామాలలో రైతులు వేల రూపాయలు ఖర్చు చేసి కొత్తగా బోర్లు వేయిస్తున్నారు. అంతేకాకుండా క్రేన్‌లు, జేసీబీల సాయంతో బావులలో పూడిక తీయిస్తున్నారు.



తెల్లబల్లి గ్రామంలో తన పొలంలో బోరు వేయిస్తున్న రైతు

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నాగారం: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన ఫణిగిరిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన రైతు బాలే వెంకన్న రోజూవారిగానే తన ఎద్దులను వ్యవసాయ క్షేత్రానికి మేతకు తోలుకెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పచ్చని గడ్డి ఉండటంతో ఎద్దు మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు ఎద్దు తలకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఎద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరాడు.

చింతపల్లి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి



మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న గణేష్ తదితరులు

లిబర్టీ: గిరిజన వ్యక్తి మృతికి కారణమైన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం ఎస్‌ఐ సతీష్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో మానవ హక్కుల కమిషన్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటికాల గణేష్ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పాలెం తండాకు చెందిన సూర్యానాయక్‌ని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సతీష్‌రెడ్డి కొట్టడం వల్లనే మృతి చెందాడని అన్నారు. ఎస్‌ఐ సతీష్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. ఎస్‌ఐ సతీష్‌రెడ్డిని శిక్షించకపోతే అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తీరొక్క సమయం

పట్టణ సుందరీకరణలో భాగంగా లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన క్లాక్‌టవర్ సెంటర్‌లోని పెద్ద గడియారం, అన్నపూర్ణ క్యాంటిన్ వద్ద ఏర్పాటు చేసిన గడియారాలు సరిగ్గా పనిచేయడం లేదు. నాలుగు వైపులా తీరొక్క సమయం చూపిస్తూ గందరగోళానికి గురిచేస్తున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



అన్నపూర్ణ క్యాంటీన్ వద్ద వేర్వేరు సమయాలు సూచిస్తున్న గడియారాలు



క్లాక్ టవర్ సెంటర్‌లో రెండు వైపులా వేర్వేరుగా సమయం చూపిస్తున్న గడియారాలు

చలికాలం.. జీవాలు పైలం



అఖిల, పశువైద్యాధికారి

నడిగూడెం: మానవ మనుగడకు ప్రకృతి సంపదతో పాటు పశుసంపద కూడా చాలా ముఖ్యం. ప్రత్యక్షంగా, పరోక్షంగా మానవ సమాజానికి పశుసంపద ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది. కాలానికి అనుగుణంగా ఆరోగ్యంపై మనుషులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో పశువులకు కూడా అలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చలికాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా పోషకులు, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గొర్రెలు, మేకల్లో దొమ్మ, జలుబు వ్యాధుల ముప్పు పొంచి ఉంది. పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం మండల పశువైద్యాధికారి అఖిల తెలిపారు. చలికాలంలో జీవాలు నిమ్ము, జలుబు, దగ్గు వ్యాధులు వస్తే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో ఆమె మాటల్లోనే..



దొమ్మ రోగం..

- దొమ్మ రోగం వ్యాప్తికి పలు రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లు, పరాన్న జీవులు కారణం. కంటే జీఎస్ కాప్రెస్ ఫ్లూరో నిమోనియా అనే వైరస్ కారణంగా మేకలకు మాత్రమే తరచుగా వచ్చే వ్యాధి ఇది. ఈ వ్యాధి సోకిన జీవాలకు తీవ్రంగా జ్వరం ఉంటుంది.
- వేగంగా శ్వాస పీల్చుకోవడం, ఎగశ్వాస, ముక్కు నుంచి నీరు, చీమిడి కారడం, ఆకలి లేకపోవడంతో రోజురోజుకూ నీరసించి పోతాయి.
- కళ్లు ఎర్రబడి నీరు కారడం, వీపు భాగం వంగి ఉండటం, తల,మెడ ముందుకు సాగినట్లు కనిపిస్తాయి. అంతేకాకుండా ముక్కు రంధ్రాలు వెడల్పుగా అవుతాయి.
- త్వరగా చికిత్స చేయించకపోతే ఊపిరితిత్తులు వాచి వాటికి చీము పట్టే ప్రమాదముంది. అయితే ఈ లక్షణాలు కనిపిస్తే దొమ్మ రోగంగా నిర్ధారణకు రాకూడదు.
- ఈ లక్షణాలు అమ్మతల్లి, పీపీ ఆర్ మొదలైన జబ్బుల్లో కూడా కనిపిస్తాయి. ఎప్పటికప్పుడూ టీకాలు వేయించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన నీటిని అందించాలి.

జలుబు, దగ్గు..

- పశువులకు తుమ్ములు, కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, చీమిడి పుసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- పశువుల పాక ఇరుకుగా ఉండడం, గాలి, వెలుతురు సరిగ్గా లేకపోవడం, పాకల్లో తేమ, తడి ఎక్కువగా ఉండటం కాలుష్యం, దుమ్ము వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చే మార్పులు ఈ జబ్బుకు కారణమవుతుంటాయి.
- అలాగే క్రిముల ద్వారా సోకే అంటువ్యాధులతో పాటు బయట నుంచి ఆహారం ద్వారా శ్వాసకోశంలోకి వచ్చే కణాలు, నూనె పదార్థం శ్వాసకోశాన్ని చికాకు పెట్టే ఇతర పదార్థాలు కూడా జలుబు, దగ్గుకు కారణమవుతాయి.
- దీని నివారణకు పాకలోకి గాలి, వెలుతురు వచ్చేలా చూడాలి. వాతావరణం సరిగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకను శుభ్రంగా ఉంచాలి. జబ్బు సోకినప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలి.
- ఒకవేళ జీవాలు చనిపోతే పోస్టుమార్టం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి, మందలోని మిగిలిన జీవులకు చికిత్స చేయించాలి.